క్లుప్తంగా

అరుణాచలేశ్వరస్వామికి రుద్రాభిషేకం


విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో వేంచేసిన అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి వారికి సోమవారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పండితులు ఉదయం స్వామి వారికి సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమం వ్యవస్థాకుడు స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి శంకుస్థాపన

గోకవరం: మండలంలోని పెంటపల్లి గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధికి సోమవారం శంకుస్థాపన చేశారు. స్మశానవాటిక అభివృద్ధికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి నిధులు సమకూర్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సూరంపాలెం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఉంగరాల రాము, ఎంపీటీసీ గండికోట వెంకట రమణ రామకృష్ణ తదితరులు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


ప్రతిభ కనబర్చిన సుగుణను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయిలు

గోకవరం: గోదావరి బాలలోత్సవంలో భాగంగా రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మండలంలోని గుమ్మళ్లదొడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఇ.సుగుణ ప్రతిభ కనబరిచిందని హెచ్ఎం లక్ష్మీకాంతం తెలిపారు. సుమారు 800 మంది పాల్గొన్న ఈ పోటీల్లో తమ పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు పాల్గొనగా సుగుణ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుందన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో సుగుణ, ఆమెకు తర్ఫీదునిచ్చిన డ్రాయింగ్ టీచర్ డీవీవీ శ్రీదేవిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండడలంలోని ఏవీ నగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళ, బుధవారాలు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ వీరభద్రరావు సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పారిశ్రామిక, చిన్నతరహా, వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తొండంగి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో సోమవారం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. తొలుత హెచ్ఎం చాత్రాడ వీవీ సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో భరతమాత, సావిత్రిభాయిపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో వివిధ సబ్జెక్టులు బోధిస్తున్న మహిళా ఉపాధ్యాయులు ఎస్.జయలక్ష్మి, ఎం.శ్రీదేవి, ఎస్.పుష్ప, పి.గీతభవాని, ఎం.గంగయ్యమ్మ, ఇ.జయ, కె.వెంకటరమణిలను ఘనంగా సన్మానించారు. పలు అంశాల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం బద్ది లోవరాజు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు రుణాలివ్వాలి

ప్రత్తిపాడు: విశ్వకర్మ యోజన పథకం ద్వారా విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి రుణాలు మంజూరు చేయాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు అత్తిలి వీరబ్రహ్మం, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధరణాలకోట శ్రీను తదితరులు సోమవారం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఇదేం దారిద్ర్యం!

- గోతులతో అధ్వానంగా రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


పెద్దపెద్ద గుంతలతో పడివున్న లచ్చిరెడ్డిపాలెంనుంచి ఎస్ఎస్ పట్నం వెళ్లే రహదారి

రౌతులపూడి: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గోతులతో అధ్వానంగా మారాయి. రహదారులు పూర్తిగా ఛిద్రమై అస్తవ్యస్తంగా ఉన్నాయి. పెద్దపెద్ద గోతులు, గుంతలతో ఉన్న రోడ్లపై వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా మార్గాల్లో ప్రయాణించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణించాలంటే ప్రాణాలను అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోతులమయంగా ఉన్న రహదారుల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆయా రోడ్లపై నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వందలాదిగా వెళుతుంటాయి. గోతుల్లో పడి తరచూ తమ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆటోలు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. రహదారులు బాగు చేయాలని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలోని బలరామపురం నుంచి ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం మీదుగా ఎస్.అగ్రహారం వెళ్లే రహదారి సుమారు 8 కిలో మీటర్లు, లచ్చిరెడ్డిపాలెం నుంచి ఎస్వీ నగరం, సీహెచ్‌వీ పడాలపురం మీదుగా ఎస్ఎస్ పట్నం వెళ్లే రహదారి–నాలుగు కిలో మీటర్లు, ఎం.చామవరం నుంచి పి.చామవరం, పారుపాక మీదగా డీజేపురం సెంటర్‌వరకు వెళ్లే రహదారి–7 కిలో మీటర్లు, రాజవరం నుంచి గంగవరం, దిగువశివాడ వెళ్లే రహదారి– నాలుగు కిలో మీటర్లు, ఎం.కొత్తూరు జంక్షన్ నుంచి దిగువ ధారపల్లి వెళ్లే రహదారి–నాలుగు కిలో మీటర్లు, గిడజాం సెంటర్ నుంచి కోదూరు మీదగా పారుపాక వెళ్లే రహదారి నాలుగు కిలో మీటర్లు, కుడుంపాత్రుని చెరువు సెంటర్ నుంచి బీబీ పట్నం మీదగా లచ్చిరెడ్డిపాలెం నాలుగు కిలో మీటర్లు మేర రహదారులు గోతులు పడి ఛిద్రమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రయాణానికి నిత్యం నానా అవస్థలు పడుతున్నారు.

అరకొరగానే మరమ్మతులు

ఇటీవల రౌతులపూడి–కత్తిపూడి ఆర్అండ్‌బీ రహదారి, ఎస్.పైడిపాల–సత్యవరం ఆర్అండ్‌బీ రహదారి, గుమ్మరేగుల–ఎస్.అగ్రహారం ఆర్అండ్‌బీ రహదారులకు రూ.లక్షలు వెచ్చించి అరకొరగానే మరమ్మతులు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను గుర్తించి గ్రామీణ రహదారులను పూర్తిస్థాయిలో బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి నిర్మాణం చేపట్టాలి



బలరామపురం నుంచి ఎస్.అగ్రహారం వెళ్లే రహదారి ఎనిమిది కిలో మీటర్ల మేర పూర్తిగా ఛిద్రమైంది. అగడుగడునా గోతులతో ఉన్న ఆ మార్గంలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో ప్రయాణం నరకయాతనే. రహదారిని నిర్మించాలని అనేక సార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఇప్పటికైనా రహదారి నిర్మాణం చేపట్టాలి.

బొడ్డు రవికుమార్, ఎ.మల్లవరం

ప్రతిపాదనలు పంపాం

ఇటీవల మండలంలోని బీబీ పట్నం–లచ్చిరెడ్డిపాలెం, లచ్చిరెడ్డిపాలెం–ఎస్ఎస్ పట్నం, రాజవరం–దిగువశివాడ, రాజవరం–గంగవరం గ్రామీణ రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి వాటికి మంజూరు ఉత్తర్వులు రావాల్సి ఉంది.

బి.శివరామకృష్ణయ్య, ఎంపీడీఓ, రౌతులపూడి

ఫార్మసిస్టులకు సర్టిఫికెట్ల అందజేత


ఫార్మసిస్టులతో ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డ్ డైరెక్టర్ కొత్త కొండబాబు, చైర్మన్ కనకరాజు

గోకవరం: మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు ఫార్మసిస్టులు తన వృత్తిలో రాణించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లైఫ్ స్టైల్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం మండలంలో కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాలలో జరుగుతోంది. ఫిబ్రవరి 4న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటివరకు రెండు బ్యాచ్‌లకు ట్రెనింగ్ నిర్వహించారు. సోమవారం ట్రెనింగ్‌లో ఉత్తీర్ణ సాధించిన వారికి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డ్ డైరెక్టర్ కొత్త కొండబాబు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ రిటైల్ ఫార్మసిస్టులు ఐదు సంవత్సరాలకు ఒకసారి తమ సర్టిఫికెట్లను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రెనింగ్‌తో ఆధునిక ప్రపంచంతో పోటీపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సెక్రటరీ పి.నాగమణి, ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథ్‌రావు, ఎస్‌పీఓ సుజిని, ట్రైనర్ ప్రేమ్ కుమార్, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు పని చేయండి

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా


ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి రాజాను కలసిన కాసే కపిల్, నాయకులు

తుని: పట్టణంలోని ప్రజల సమస్యలపై పోరాడాలని, పార్టీ పటిష్టతకు సమన్వయంతో పని చేయాలని వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా సూచించారు. ఇటీవల మున్సిపల్ విభాగం పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన 25వ వార్డుకు చెందిన కాసే కపిల్ సోమవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాజాను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై పోరాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని రాజా అన్నారు. అధికార పార్టీ దాడులను దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు, కౌన్సిలర్లు పామర్తి మహేష్, షేక్ ఖ్వాజా, కర్రి సత్య సగదీష్, కనిగిరి వెంకటరమణ, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, రేలంగి రమణాగౌడ్, చింతల పండు, నానాజీ తదితరులు కపిల్‌ను అభినందించారు.

దాడిశెట్టి రాజాను కలసిన రైతు విభాగం అధ్యక్షుడు


వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు వీర్రాఘవులును శాలువాతో సత్కరిస్తున్న దాడిశెట్టి రాజా

తుని రూరల్: వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను ఆ పార్టీ తుని నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్.అన్నవరంలోని తన కార్యాలయంలో ఉన్న దాడిశెట్టి రాజాను కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్టీ తనకు అప్పగించిన రైతు విభాగం అధ్యక్ష బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన దాడిశెట్టి రాజాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వీర్రాఘవులును శాలువాతో సత్కరించిన రాజా రైతుల పక్షాన నిలిచి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, దుంగల నాగేశ్వరరావు, లంక కృపానందం, బత్తుల వీరబాబు, వెలగా వెంకట కృష్ణాజీ, నాగం గంగబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముద్రగడతోనే పార్టీ బలోపేతం


ముద్రగడను మర్యాదపూర్వకంగా కలసిన కత్తిపూడి పార్టీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబుతోనే పార్టీ మరింత బలోపేతం సాధ్యమని ఆ పార్టీ నేత గౌతు వాసు అన్నారు. కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో ఆయనతో పాటు గిరిబాబును కత్తిపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో సమస్యలపై ముద్రగడతో చర్చించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముద్రగడ గిరిబాబు విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గౌతు స్వామి, ఆకుల రాంబాబు, కమ్మిల బాబీ, కమ్మిల నానీ, గౌతు ఆనంద్, గౌతు శ్రీను, బొమ్మిడి జయబాబు, బొమ్మిడి రాజు, కర్రిబాబీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి


ఏలేశ్వరంలో ఆందోళనలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్థానిక ఆర్టీసీ డ్రైవర్ ఎస్వీ రమణ సస్పెండ్‌పై ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలకు కారణమైన సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 10న డ్రైవర్ ఎస్వీ రమణ ఏలేశ్వరం నుంచి విజయవాడ సర్వీస్‌కు వెళుతుండగా ఒక ప్రయాణికురాలు రాజమహేంద్రవరంలో బస్సు ఎక్కి విజయవాడ నిమిత్తం రూ.300 ఇవ్వగా టిక్కెట్ ఇవ్వలేదన్నారు. మార్గం మధ్యలో తనిఖీ సిబ్బంది ప్రయాణికురాలికి టిక్కెట్ రూ.295, చిల్లర రూ.5 ఇవ్వకపోవడాన్ని గుర్తించి కేసు నమోదు చేశారన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారుల అభియోగం మేరకు డ్రైవర్‌ను సస్పెండ్ చేశామన్నారు. ఉద్యోగులు ఆందోళన చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. సమస్య జఠిలం చేయవద్దని, ఉద్యోగులు సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న ఆందోళనలు

స్థానిక ఆర్టీసీ డ్రైవర్‌ను అక్రమంగా సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలు కొనసాగుతున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం డిపో గేట్ వద్ద ఉద్యోగులు ధర్నా చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు
- వీక్షించిన భక్తులు


టి.తిమ్మాపురం లక్ష్మీనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

తుని రూరల్: టి.తిమ్మాపురం శివారు విష్ణుపురంలో కొలువైన మహావిష్ణు ఆలయంలో శ్రీలక్ష్మీనారాయణ దివ్య కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, కోలాటం నడుమ గ్రామంలో పల్లకీలో ఊరేగించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పోల్నాటి శేషగిరిరావు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా అర్చకులు శాస్త్రోక్తంగా వార్షిక దివ్య కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని తిలకించారు. వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు, భక్తులు పాల్గొన్నారు. ఎస్.అన్నవరంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి,అమ్మవార్ల మాస కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.

కిర్లంపూడి: కిర్లంపూడిలో వేంచేసి ఉన్న భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. పెంటకోట నాగబాబు, సత్యవేణి దంపతులు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణ నిర్వహించారు.

'యువత పోరు'ను విజయవంతం చేయాలి

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు
- కిర్లంపూడిలో వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: కాకినాడలో ఈ నెల 12వ తేదీన చేపట్టే యువత పోరు కార్యక్రమాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు విజయవంతం చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పిలుపునిచ్చారు. కిర్లంపూడిలోని తన నివాసంలో యువత పోరు వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డురాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి పథకాన్ని అందించిందన్నారు. ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ, ఐబీ సిలబస్ ప్రవేశపెట్టి 8వ తరగతి నుంచి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేద పిల్లలకు ఇవన్నీ దూరం చేసిందని విమర్శించారు.

నిధులు విడుదల చేయకపోవడంతో...

ఈనాటి నిరుపేద బాలలను రేపటి కూలీలుగా చేయడమే చంద్రబాబు ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా విద్యాదీవెనకు నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. వీటిలో 5 కాలేజీలను ప్రారంభించారని, మిగిలినవి నిర్మాణ దశలో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటి పనులను నిలిపివేశారన్నారు. 2025–26 నాటికి ఏపీలో 2,250 మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకురావాలనే జగన్ ఆశయాన్ని కూటమి ప్రభుత్వం తుంగలోకి తొక్కిందన్నారు. వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతితో పాటు అనేక అమలు కాని మోసపూరితమైన హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. పేదవిద్యార్థుల ఆశయాలకు అడుగడుగునా అడ్డుపడుతున్న కూటమి ప్రభుత్వాన్ని యువత నిలదీయవలసిన అవసరం ఉందన్నారు. యువత, ప్రజలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దీనిలో భాగంగా ఈ నెల 12న కాకినాడలో వైఎస్సార్ సీపీ తలపెట్టిన యువత పోరులో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హామీలు నెరవేర్చని దగా ప్రభుత్వం

- మాజీ మంత్రి తోట నరసింహం
- జగ్గంపేటలో యువత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


జగ్గంపేటలో యువత పోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న తోట నరసింహం, నాయకులు

జగ్గంపేట: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయలేక చతికల పడుతున్న దగా ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేట పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటిపోయినా ఫీజు రియింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనంతో పాటు ఏ ఒక్క హామీని అమలు చేయలేక పోయిందన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ నిధులు విడుదల, హామీల అమలు కోరుతూ ఈ నెల 12న కాకినాడలో నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు జగ్గంపేట పార్టీ కార్యాలయంలో యువత పోరు వాల్ పోస్టర్‌ను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను హామీలతో మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రియింబర్స్‌మెంట్ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేశారన్నారు. ఇచ్చిన హామీలు, పథకాలను తూ.చా. తప్పకుండా ప్రజలకు అందించిన ఘనత కేవలం వైఎస్ కుటుంబానికే దక్కుతుందన్నారు. ఈ నెల 12న వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగ్గంపేట పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఇక్కడ నుంచి నేరుగా కాకినాడలో జరిగే యువత పోరు కార్యక్రమానికి తరలివెళతామని తోట నరసింహం తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, గోకవరం మండల అధ్యక్షులు పాటి రాంబాబు, జగ్గంపేట పట్టణ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, మండల నేతలు తులా రాము, రామకుర్తి జగాల్, కె.రవి, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు జనసంద్రం


గజేంద్ర పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


స్వామి దర్శనానికి ఎండలోనే బారులు తీరిన భక్తులు

- వేంకటేశ్వరస్వామి తిరునాళ్లు ప్రారంభం
- స్వామివారి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- వసతుల లేమితో ఇక్కట్లు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో వేంచేసిన వేంకటేశ్వరస్వామి వార్షిక దివ్య కల్యాణ మహోత్సవాలు (తిరునాళ్లు) సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచి తాళ్లూరు పరిసర ప్రాంతాలు గోవింద నామసర్మణతో మార్మోగాయి. మెట్టప్రాంతంలోని పలు గ్రామాల భక్తులు వేకువజామునే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. కోనేరులో తెప్పలు విడిచి స్వయంపాకాలు ఇచ్చుకుని స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఆలయం వైపు వెళ్లే రహదారులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ప్రోటోకాల్ కలిగిన అధికారులు, పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులకు సైతం ఆలయం వద్దకు చేరుకునేందుకు మూడు గంటల సమయం పట్టింది. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ వాహనాలపై స్వామి, అమ్మవార్లను మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సైలు, సిబ్బంది పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ ఉండమట్ల రాజేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆదాయం ఫుల్, సౌకర్యాలు నిల్

స్వామివారి తిరునాళ్ల సందర్భంగా భక్తులు భారీగా స్వామి వారికి విరాళాలు, కానుకలు సమర్పించారు. ఆదాయం వస్తున్నప్పటికీ తమకు కనీస సౌకర్యాలు కల్పించలేదని భక్తులు వాపోయారు. స్వామివారి దర్శనం కోసం టికెట్లు కొనుక్కుని క్యూలో వేచి ఉన్న భక్తులకు కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎండ తీవ్రత నేపథ్యంలో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.96 వేలు టిక్కెట్ల రూపంలోనూ, రూ.11 వేలు సైకిల్ స్టాండ్ నిమిత్తం వేలం పాటలు జరిగినట్టు తెలిసింది. తిరునాళ్లకు వచ్చే భక్తులకు పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ, పిల్లలకు పాలు, భోజనాలు ఏర్పాటు చేశారు.

స్వామి వారిని దర్శించుకున్న నేతలు

తాళ్లూరు వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు స్వామి వారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్, జేఎస్పీ జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సత్యనారాయణస్వామి సామూహిక వత్రాలు

జగ్గంపేట: గ్రామంలో వేంచేసిన రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణస్వామి వత్రాలు నిర్వహించారు. రాజగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలను సోమవారం ప్రారంభించారు. ఈ 15 వరకూ అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా కొండరాజుల బాబు పండగ

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో సోమవారం కొండరాజుల బాబు పండుగ ఘనంగా జరిగింది. శెట్టిబలిజ సామాజిక వర్గం ఆధ్వర్యంలో పండుగ నిర్వహించారు. పెదశంకర్లపూడితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కొండరాజులబాబును దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.